క్లుప్తంగా

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

హనుమంతునిపాడు: 18 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటు హక్కు కోసం ఫాం-6న దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా కానీ, సచివాలయ పరిధిలోని బీఎల్‌ఓలకు, తహసీల్దార్ కార్యాలయంలో నవంబర్ 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్లకు రూ.60 లక్షల నిధులు మంజూరు

హనుమంతునిపాడు: మండలంలోని 7 సచివాలయాల పరిధిలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరైనట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. మిట్టపాలెం, గాయంవారిపల్లి, వాలిచర్ల, హనుమంతాపురం, దాసరిపల్లి, పెద్దగొల్లపల్లి, హనుమంతునిపాడు గ్రామాల్లో ఎంపీపీ నిధులతో 13 వర్కులు మంజూరైనట్లు తెలిపారు. 14 సచివాలయాల కింద గడప గడపకు మన ప్రభుత్వం సంబంధించి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.

కబడ్డీ క్రీడాకారిణి శ్రీలక్ష్మికి అభినందన



శ్రీలక్ష్మిని సత్కరిస్తున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: జాతీయ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించిన సింగరాయకొండ గ్రామ సచివాలయం-3 సంక్షేమ, విద్యా సహాయకులు శ్రీలక్ష్మిని తహసీల్దార్ సీహెచ్ ఉష అభినందించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. శ్రీలక్ష్మి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని తహసీల్దార్ ఆకాంక్షించారు. డిప్యూటీ తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, అశోక్, వీఆర్‌ఓ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు పాకల విద్యార్థి ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన రవివర్మ

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.రవి వర్మ ఎంపికైనట్లు హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బొద్దికూరపాడులో నిర్వహించిన పోటీల్లో రవివర్మ సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. నవంబరు 9 నుంచి 11వ తేదీ వరకు అలూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పాఠశాల పీడీ పి.హజరత్తయ్య తెలిపారు. రవివర్మను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.


మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పామూరు: ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, నరసింహారావు తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కనిగిరిలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. వజ్రాల సుబ్బారావు, పోతల ప్రభాకర్, మల కొండయ్య పాల్గొన్నారు.

ఆర్డీఓ స్పందనకు 28 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 28 వినతులు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 13, కనిగిరి టౌన్ నుంచి 2, పీసీపల్లి 1, వెలిగండ్ల 3, కొనకలమిట్ల 2, పామూరు 1, పొదిలి 1, దొనకొండ 1, హెచ్‌ఎంపాడు 1, సీఎస్‌పురం నుంచి 3 అర్జీలు ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు అందజేశారు. అర్జీలను పరిశీలించిన తక్షణ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు ఆర్డీఓ ఆదేశించారు. స్పందనలో ఏఓ బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్లకు శిక్షణ ప్రారంభం



ఉత్సాహంగా సాగుతున్న జిల్లా ఖోఖో జట్ల శిక్షణ



శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం ఇందిరా

కనిగిరి రూరల్: జిల్లా స్థాయి ఖోఖో బాలికల జట్ల శిక్షణ తరగతులు సోమవారం మండలంలోని పాత పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం ఇందిరా దేవి ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, స్వగ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు లక్ష్య సాధన దిశగా ముందడుగు వేయాలన్నారు. పీడీ బి.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు శిక్షణలు జరుగుతాయన్నారు. ఈ ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలికల ఖోఖో జట్టు వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. శిక్షణ తరగతులకు కోచ్‌లుగా పీడీలు పి.సావిత్రమ్మ, వై శ్రీనివాసులరెడ్డి, వ్యవహరిస్తున్నట్లు జిలా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.వనజ తెలిపారు. క్రీడా కారులు 15 మందికి గ్రామస్తులు భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలటూరి నవమ్మ, విద్యా కమిటీ చైర్మన్ అట్లా పిచ్చిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

4, 5న ఓటరు జాబితాపై స్పెషల్ డ్రైవ్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: నూతనంగా సవరించిన ఓటరు జాబితాపై నవంబర్ 4, 5వ తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సవరించిన ఓటరు జాబితాపై బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీన సవరించిన ఓటరు జాబితాలను మండలంలోని 60 మంది బీఎల్‌ఓలకు అందజేశామన్నారు. నవంబర్ 4, 5 తేదీల్లో బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటర్లు పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సవరణలు ఏమైనా ఉంటే బీఎల్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్ల వివరాలు సేకరించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రచురించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ టి.వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆర్‌డబ్ల్యూఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన గ్రామీణ నీటి సరఫరా అండ్ పారిశుద్ధ్య శాఖ సబ్ డివిజన్ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం అంకమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయ భవన సముదాయంలోనే నడుస్తుంది. చాలా కాలం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు సొంతంగా భవనం నిర్మించాలని ప్రతిపాదన ఉంది. ఈ నేపథ్యంలో 60అడుగుల రోడ్డులో నిర్మించిన భవనం పూర్తి కావడంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు. దీంతో ఇక నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కార్యకలాపాలు నూతన భవనంలో ప్రారంభం కానున్నాయి.

అలవేటి మండప పనులు ప్రారంభం



అలవేటి మండప నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ నిర్మాణంలో రెండో దశ పనుల్లో భాగంగా అలవేటి మండప నిర్మాణ పనులను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజల అనంతరం లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే అమ్మవారి ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తయింది. ఇక ఆలయం ముందు భాగాన దాదాపు రూ.4 కోట్లతో నిర్మించనున్న అలవేటి మండప నిర్మాణ పనులను ప్రస్తుతం ప్రారంభించారు. ప్రధాన ఆలయం మాదిరే మండపాన్ని కూడా పూర్తిగా రాతిశిలతో నిర్మాణం చేయనున్నారు. అమ్మవారి ఆలయానికి ఈ మండప నిర్మాణం మరింత శోభను తీసుకొచ్చేలా ఇప్పటికే శిల్పులు మండపానికి రూపకల్పన చేశారు. శరవేగంగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీకి, శిల్పులకు సూచించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, జి/ శ్రీనివాసులు, ఆవుల మాధవరావు, శిల్పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108 లో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఉలవపాడు: మలుపు తిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయరహదారిపై రాజుపాలెం జంక్షన్ వద్ద సోమవారం జరిగింది. వివరాలు.. గుడ్లూరు శివాలయం వీధికి చెందిన పోట్లూరి వెంకటేశ్వర్లు, కోటయ్యలు ఉలవపాడులో కూలిపనికి వచ్చి తిరిగి తమ ద్విచక్రవాహనంపై గుడ్లూరు వెళుతున్నారు. రాజుపాలెం జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న వెంకటేశ్వర్లు, కోటయ్యలకు గాయాలయ్యాయి. వీరిని ఉలవపాడు 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అదే వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి సేద్యంతో బీడు భూముల్లోనూ సిరులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కొండపి(సింగరాయకొండ): ప్రకృతి వ్యవసాయం ద్వారా బీడు భూముల్లో సిరులు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి రంజిత్ పేర్కొన్నారు. కొండపి మండలంలోని పెరిదేపిలో సోమవారం బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు ఏ విధంగా పండించవచ్చో రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. డాట్ ప్రూఫ్ పద్ధతిలో ప్రతి మూడు అడుగులకు ఆముదం, కంది, గోరుచిక్కుడు, మినుములు, సజ్జ విత్తనాలు పొలంలో చల్లారు. ప్రకృతి సేద్యంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామ సర్పంచ్ అంగలకుర్తి గిరి, ఎస్తేర్, ఐసీఆర్‌పీఎస్ గౌతమి, సుజాత, తిరుమల, ఏడుకొండలు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



రైతులకు అవగహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు ప్రత్యామ్నాయ పంటలైన జనుము, జీలుగు, మిరప సాగు చేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో పొగాకు పంట ఉత్పత్తి నియంత్రణ పొగాకుల పత్యామ్నయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పొగాకు బ్యార్నీ రిజిస్ట్రేషన్ గడువు సాధారణ రుసుంతో నవంబర్ 9 వరకు, రూ.100 రుసుంతో 23వ తేదీ వరకు, రూ.400 రుసుంతో డిసెంబర్ 4 వరకు పొడిగించినట్లు తెలిపారు. సొంత బ్యార్నీ ఉన్న వారు మాత్రమే పొగాకు సాగు చేయాలని, అధిక ధరలకు కౌలుకు తీసుకోవడం వల్ల నష్టపోతారని చెప్పారు. పంట మార్పిడి ద్వారా పొగాకులో మల్లెను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్జీఓ సిద్ధరాజు, పొగాకు కంపెనీల ప్రతినిధులు రామాంజనేయులు, వెంకట్రావు, శ్రీనివాసులు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మా భూములకు రక్షణ కల్పించండి

ముండ్లమూరు: ప్రభుత్వం మాజీ సైనికులకు ఇచ్చిన భూమికి రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ సైనికులు గంటా రాజేష్, కుమ్మిత వెంకటసుబ్బారెడ్డి సోమవారం తహసీల్దార్ నయీం అహ్మద్‌కు స్పందనలో విన్నవించుకున్నారు. తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కుమ్మిత వెంకటసుబ్బారెడ్డికి 2013లో సర్వే నంబర్ 13-44లో రెండు ఎకరాలను, బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన గంటా రాజేష్‌కు అదే ఏడాది సర్వే నంబర్ 318-45లో రెండు ఎకరాలను ప్రభుత్వం కేటాయించి పట్టా మంజూరు చేశారు. ఇటీవల ఆ పొలం వద్దకు వెళ్లగా వేరే వారు ఆ భూమిని సాగు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.67 లక్షలు



ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ.1,67,703 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.73 వేలు, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.30,640, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.18,831, ఆలయంవద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.30,232 వచ్చినట్లు తెలిపారు. ఇతర విరాళాల ద్వారా రూ.15 వేలు ఆదాయం వచ్చిందన్నారు. మహాప్రాకార నిర్మాణానికి జిల్లాలోని మార్కాపురానికి చెందిన వేముల వెంకటేశ్వర్లు, పుష్పలత దంపతులు విరాళంగా రూ.25,116 ఇచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన ఆదినారాయణ తెలిపారు. కొమ్మినేని వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి, వంటపాత్రల పంపిణీ



పాఠశాలలకు వంటపాత్రలు, క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓలు ఆయా పాఠశాలలకు కేటాయించిన వంట పాత్రలు, క్రీడాసామగ్రి పంపిణీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద తయారీకి అవసరమైన వంటపాత్రలు, గిన్నెలు, పేట్లు మొదలైన కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు అందజేస్తుందన్నారు.

హుండీలో నగదు చోరీ

కంభం: ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు అపహరించుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు.. స్థానిక వాసవీ స్కూల్ వెనుక వైపున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగలు సోమవారం తలుపులు పగలగొట్టి లోపల ఉన్న హుండీలోని నగదు దోచుకెళ్లారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుండీలోని నగదును ఐదు నెలలుగా తీయలేదని, సుమారు ఐదు వేల రూపాయలకుపైగా నగదు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. నివాసాల మధ్య ఉన్న గుడిలో దొంగతనానికి పాల్పడటంతో చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



ఎండిన పంటలను పరిశీలిస్తున్న పమిడి వెంకటరావు

హనుమంతునిపాడు: హనుమంతునిపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘ నాయకుడు పమిడి వెంట్రావు, కార్మిక వ్యవసాయ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, కూటాగుండ్ల, తదతర గ్రామాల్లో సోమవారం ఎండిన పంటలను పరిశీలించారు. తీవ్ర కరువుకు ఎండిన పంటలు, నీరుపోయి పొగాకు నాట్లు వేస్తున్న పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షం లేక సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరువు మండలంగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాని కూరారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకలు పిల్లి తిప్పారెడ్డి,నాగిరెడ్డి, రమణారెడ్డి, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం

● ఆర్టీసీ ఆర్‌ఎం సుధాకర్



పొదిలి డిపోను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుధాకర్

పొదిలి రూరల్: ప్రయాణికులను సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్య స్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని ఒంగోలు రీజినల్ మేనేజర్ డి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పొదిలి ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్తీకమాసం త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. పొదిలి-ఒంగోలు రూట్‌లో గతంలో 7 బస్సులు నడిచేవని, ఇప్పుడు ఆ సంఖ్యను 11కు పెంచామని తెలిపారు. ఇతర డిపోలకు చెందినవి కాకుండా ప్రతి 20 నిమిషాలకు పొదిలి-ఒంగోలు మధ్య 11 బస్సులు 48 ట్రిప్పులు తిరుగుతున్నాయని వివరించారు. టూరిజంలో భాగంగా జిల్లాలోని అన్ని డిపోల నుంచి శ్రీశైలానికి 298, పంచారామం 21, అరుణాచలం 7, ఇతర ప్రాంతాలకు 14 ప్రత్యేక బస్సులు నడిపామని వెల్లడించారు. ఈ ఏడాది అంతకంటే ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనిపై ఇప్పటికే డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ఏడాది ప్రత్యేక బస్సులు నడిపి బాగా ఆదాయం తెచ్చినందుకు ప్రకాశం రీజియన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆర్టీసీ కార్గో విధానంలో చాలా మార్పులు చేశామన్నారు. పట్టణానికి 10 కిలోమీటర్ల లోపు ఉంటే డోర్ డేలివరీ సౌకర్యం కల్పిస్తామన్నారు. బస్సుల్లో చిల్లర సమస్య లేకుండా డిజిటల్ పేమెంట్ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆర్టీసీ కార్గో సేవలపై ఈ నెల 26 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పొదిలి నుంచి దర్శి, అద్దంకి మీదుగా విజయవాడ వెళ్లే బస్సుల సమయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుందరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

గిద్దలూరు రూరల్: మండలంలోని గడికోట అటవీ శాఖ చెక్‌పోస్టు సమీప పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీకి గురైన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని రాగి వస్తువులను అపహరించారు. బయట పడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విడి భాగాలను గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులకు విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

జెడ్పీటీసీ చలమారెడ్డి తల్లి మృతి

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడులో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి తల్లి లక్ష్మీదేవి ఆదివారం రాత్రి మృతి చెందారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి తనయుడు, జార్జి విద్యా సంస్థల సెక్రటరీ ఆదిమూలపు విశాల్.. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎర్రగొండపాలెం ఎంపీపీ దొంత కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, డీపీఓ నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి సతీమణి సుబ్బమ్మ, ఎంఈఓ శ్రీనివాసులు, సచివాలయ మండల కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బలుసుపాటి లూథియా, ఎంపీటీసీలు, సర్పంచులు.. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యుత్ ప్రమాద బాధితునికి రూ.5 లక్షల పరిహారం

● చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని 17వ వార్డులో కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో నివసిస్తున్న పోసాని సుధీర్‌కు రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం అందజేశారు. సుధీర్ 3 నెలల క్రితం ఆడుకుంటూ మాగుంట పార్కు సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పొరపాటున తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన వాహనంలో సుధీర్‌ను జిల్లా వైద్యశాలకు తీసుకునివెళ్లి వైద్యం చేయించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లి బాధిత బాలునికి నగదు బదిలీ పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయించారు. సంబంధిత చెక్కును బాలుడి ఇంటికివెళ్లి అందజేశారు. ఇంకా ఏదైనా సాయం అవసరమైతే చేస్తానని, బాగా చదివించాలని సుధీర్ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ షియానాయక్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన కమిటీ చైర్మన్‌గా గురుబ్రహ్మం

తాళ్లూరు(ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటిగంగా భవాని అమ్మవారి దేవస్థాన నూతన కమిటీ చైర్మన్‌గా కొనన గురుబ్రహ్మం పలువురు సోమవారం అభినందించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గురుబ్రహ్మంను కలిసి అభినందనలు తెలిపారు. మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యాడిక యలమందారెడ్డి, తూర్పుగంగవరం వైస్ సర్పంచ్ వై కాశిరెడ్డి, ఎంఎల్‌ఓ బి.నాగమల్లేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.దేవదానం, ప్రసాద రెడ్డి, తదితరులు ఉన్నారు.

1 నుంచి చినారికట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: నవంబర్ ఒకటో తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చినారికట్ల గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం చినారికట్ల గ్రామ సచివాలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ గోసుల అనురాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. 1వ తేదీ సాయంత్రం చినారికట్ల ఎస్సీ కాలనీలలో 2వ తేదీన చినారికట్ల, జంక్షన్ ప్రాంతంలో కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ముందుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గడప గడపకూ వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

1న గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం

1వ తేదీన కొనకనమిట్ల, తువ్వపాడు, చినారికట్ల, గార్లదిన్నె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.